క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి వందన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావేరి ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలో 40 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పూర్తి అర్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. రూ.10నుంచి 15వేల వరకు వేతనం ఉంటుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జహీరాబాద్ టౌన్: గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యవతకు జీవనోపాధి కోసం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ ఏపీఎం శివకుమార్ ప్రకటనలో మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఇంగ్లీష్ వర్క్‌రెడీనెస్ అండ్ కంప్యూటర్, స్వయం ఉపాధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అంకుర మండల మహిళా జహీరాబాద్ కార్యాలయంలో స్క్రీనింగ్ క్యాంప్ ఉందన్నారు. అసక్తి ఉన్న వారు ఈ నెల 4న హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9100044619 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మండల అభివృద్ధికి కృషి



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గుమ్మడిదల ఎంపీపీ సద్ది ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ న్నారు. గుమ్మడిదల మండలంలోని అన్ని గ్రామాల్లో రూ.2.80కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీపీ, జెడ్పీటీసీలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదేళ్లగా మండల పరిధిలోని అన్ని గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేవిధంగా నిధులు కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్, హుస్సేన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దుస్తులను చూపుతున్న విద్యార్థులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని వెంకటాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కామారెడ్డికి చెందిన దుస్తుల వ్యాపారి సహకారంతో గ్రామానికి చెందిన దేశముఖ్ విజయ, బాలకిషన్‌రావు దంపతులు మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేద విద్యార్థులు కావడంతో తాము ఈ దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు కాశీరాం, ధన్‌సింగ్, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సురేష్, సాయిలు, వీఓ లీడర్ శ్రీశైలం పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు

జిన్నారం(పటాన్‌చెరు): యువత అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన యువజన నాయకులు ఆంజనేయులు, సుధాకర్ కలిసి సొంతంగా వ్యాపారాన్ని చేపట్టారు. ఈ వ్యాపార కేంద్రాన్ని మంగళవారం నీలం మధు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంతంగా వ్యాపారాలు చేసుకునేవిధంగా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం నిర్వహకులు, నాయకులు నీలం మధును సన్మానించారు.

సమష్టి కృషితోనే

అభివృద్ధిని సాధించాం

- నర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తా
- వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ గిరిధర్‌రెడ్డి



జహీరాబాద్: మండల పరిషత్ పాలకమండలి సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

జహీరాబాద్: సమష్టి కృషి, సహకారంతోనే మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు ఎంపీపీ, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ పాలక మండలి పదవీ కాలం ముగుస్తున్నందునా మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. ఇందుకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సహకరించినందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నందునా ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి బిల్లులు ఇప్పించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, వైస్‌ఎంపీపీ రాములు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లను ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, అధికారులు కోటేశ్వరరావు, ప్రవీణ, బస్వరాజ్, ప్రవీణ్, శివకుమార్, అశోక్‌కుమార్, మహేష్, నాగరాణి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీటీసీలు లీలావతి, నర్సింహులు, పార్వతి, అరుణజ్యోతి, స్వరూప, అఫ్రా బేగం, ఇస్మాయిల్, రాములు, కో–ఆప్షన్ సభ్యుడు మైనొద్దీన్, మాజీ సర్పంచ్‌లు జగన్మోహన్, పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, జ్యోతి, మాణిక్‌రెడ్డి, రాజు, సుగుణబాయి పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్: మండల పరిషత్ పాలకమండలి సభ్యులను సన్మానిస్తున్న జెడ్పీటీసీలు, అధికారులు

అందరి సహకారంతోనే సమస్యలను పరిష్కరించాం

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే, అధికారుల సహకారంతోనే మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిని చేశామని ఎంపీపీ సుష్మశ్రీ అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప, భారతినగర్ కార్పొరేటర్ సింధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో తనకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని గ్రామాల్లో పర్యటించి అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. జెడ్పీటీసీ సుప్రజ మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవీ కాలంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ సుప్రజ, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధు, పుష్ప, వివిధ శాఖల అధికారులు కలిసి ఎంపీటీసీలను, తాజా మాజీ సర్పంచ్‌లను ఎంపీపీ సుష్మశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, ఎంఈఓ పీపీ రాథోడ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, వివిధ గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గృహ జ్యోతి పథకానికి సంబంధించిన జీరో విద్యుత్ బిల్లు జారీ ప్రక్రియను ప్రారంభించింది. ఆన్‌లైన్ తప్పిదం తదితర కారణాలతో కొంతమంది అర్హులకు జీరో బిల్లు రాలేదు. దీంతో గృహజ్యోతి పథాకానికి ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తు చేసుకొన్న అర్హులకు 200 యూనిట్ల లోపు రీడింగ్ ఉంటే ఉచిత విద్యుత్ అమలు చేయాలనేది పథకం ఉద్దేశం. ప్రజా పాలనలో చేసిన దరఖాస్తులను జనవరిలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే డేటా ఆపరేటర్లకు సమయం తక్కువగా ఇవ్వడంతో వివరాలను హడావుడిగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో చాలామంది వివరాలు కనిపించలేదు. కొంతమందికి నాట్ అప్లై అని చూపిస్తుంది. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన చాలామందికి ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు. దీంతో పేదలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇనాళ్లు అధికారులు పట్టించుకోలేదు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని జీరో బిల్లు రానివారి నుంచి మళ్లీ మున్సిపల్ అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

• పారిశుధ్యం అస్తవ్యస్తం



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని కాలనీలలో ఉదయం స్వచ్ఛఆటోలు చెత్తను సేకరిస్తున్నాయి. అనేకమంది స్వచ్ఛ ఆటోలోనే చెత్తను వేస్తున్నారు. కానీ.. మరికొంత మంది చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా ఇష్టానుసారంగా రోడ్ల పక్కనే పారవేస్తున్నారు. దీంతో పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

• తాగునీరు వృథా



వృథాగా వెళుతున్న తాగునీరు

మునిపల్లి: మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో మంగళవారం మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి రోడ్డుపై పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుదేరా నుంచి పోల్కంపల్లి గ్రామస్తులకు మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీటి సరఫరా అవుతోంది. ఒక్కసారిగా జెయింట్ దగ్గర పైపులు పగలడంతో తాగునీరంతా రోడ్డుపై వృథాగా వెళ్లింది. విషయం తెలుసుకున్న అధికారులు నీటి వృథాను అరికట్టారు. పైపులైన్‌లు లీకేజీ కాకుండా మిషన్ భగీరథ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శ్రీకాంత్ మృతి తీరని లోటు

హత్నూర(సంగారెడ్డి): యువజన కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం శ్రీకాంత్ మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ తరఫున ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యం, యువజన కాంగ్రెస్ నాయకులు మణిదీప్, ప్రసాద్, శ్రీకాంత్, ఆంజనేయులు, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కార్యలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



రాఘవయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చెట్లపోతారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన రాఘవయ్య మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంపీపీ, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి, తోటి ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు రాఘవయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాఘవయ్య శేష జీవితం ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

పాన్‌షాప్‌లో చోరీ

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఎఫ్‌జడ్ పాన్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి పాన్‌షాపు తాళాలు పగలగొట్టి రూ.లక్ష విలువ చేసే సిగరెట్ డబ్బాలు, నగదును దోచుకెళ్లారు. దీంతో పాన్‌షాపు నిర్వాహకుడు ముజీమోద్దిన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అదే విధంగా పార్కింగ్ చేసిన కారు, వ్యానులోని డీజిల్‌ను, బ్యాటరీని సైతం దొంగిలించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం

ఎంపీపీ సద్ది ప్రవీణ



ఎంపీపీ ప్రవీణ

జిన్నారం(పటాన్‌చెరు): ఐదేళ్లలో గుమ్మడిదల మండల వ్యాప్తంగా రూ.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుమ్మడిదల ఎంపీపీ సద్ది ప్రవీణ తెలిపారు. నేటితో ఎంపీపీల పదవీకాలం ముగియనుండటంతో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు. గుమ్మడిదలలో ఎంపీపీ నూతన భవనంతో పాటు పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం తమ హయాంలో జరగటం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎంపీపీ, ఎమ్మెల్యే, సీఎస్ఆర్ తదితర నిధులతో మారుమూల గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఐదేళ్లతో తమకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, యువజన సంఘాల నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సైన్స్ ల్యాబ్ పరికరాలు పంపిణీ



సైన్స్ ల్యాబ్ పరికరాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీబాయి

నారాయణఖేడ్: మండల పరిధిలోని చాప్టా(కె), అబ్బెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు జెడ్పీ నిధులతో సమకూర్చిన సైన్స్ ల్యాబ్ పరికరాలను మంగళవారం జెడ్పీటీసీ లక్ష్మీబాయి పంపిణీ చేశారు. విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్ బోధన అవసరమెంతో ఉందన్నారు. అనంతరం ఆయా పాఠశాలలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను అభినందించగా వారు ఆమెను సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రవీందర్‌నాయక్, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు సంగప్ప, రాజునాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక**

సంగారెడ్డి: ఈనెల 13 14వ తేదీల్లో జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్ సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న 9వ రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ ఈత పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను జిల్లాల వారీగా ఎంపిక చేస్తున్నట్లు స్విమ్మింగ్ కోచ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఈ నెల 4వ తేదీన జిల్లా స్థాయిలో జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి అండర్ 11, 14, 17 కేటగిరిలలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌కు ఈ నెల 4వ తేదీన ఉదయం 9 గంటల వరకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు శశికుమార్ ఫోన్ నెంబర్ 9494991828ను సంప్రదించాలని సూచించారు.

◆ **ధర్నాను విజయవంతం చేయాలి**

వట్‌పల్లి(అందోల్)/జోగిపేట: వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని జూలై 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. అందోల్ డివిజన్ ఎన్‌పీఆర్‌డీ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా సుభాష్, ఉపాధ్యక్షుడిగా ఆగయ్య,శ్రీనివాస్, కార్యదర్శిగా రాంచందర్, సహాయ కార్యదర్శిలుగా కృపావర్మ, రమాదేవి, నర్సింలు, సభ్యులుగా యాదుల్, జయమ్మ, చెన్నయ్య, యాదగిరి, వీరేశం, గణేష్, ఆబేదద్, ఉస్మాన్ ఎన్నికయ్యారు.

◆ **మెగా డీఎస్సీ నిర్వహించాలి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు భరత్ యాదవ్, అనిల్, శ్రీకాంత్, మనోహర్, సాకేత్, రోహిత్ పాల్గొన్నారు.

◆ **రోడ్డు పనులు చేపట్టాలి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూరు మీదుగా ఏటిగడ్డ సంఘం, మాలపాడ్ గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల పంచాయతీ అధికారి నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఆనంద్, ప్రశాంత్, మాణిక్యం, నర్సింలు, దుర్గరాజు, నరేష్, హరికృష్ణ, పాపయ్య, షకీల్, అనిల్, మల్లేశం, నాగరాజ్ పాల్గొన్నారు.

◆ **ప్రభాకర్ సేవలు మరువలేనివి**

సంగారెడ్డి: సంగారెడ్డిలోనీ ట్రాన్స్‌కో స్టోర్ ఇన్‌చార్జి, విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారా ప్రభాకర్‌గౌడ్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని ఫంక్షన్ హాలులో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్సీ మాధవరెడ్డి, విద్యుత్ శాఖ డైరెక్టర్ రాములు మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో ప్రభాకర్‌గౌడ్ 44 ఏళ్ల పాటు చేసిన సేవలు మరువలేనివ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, యూనియన్ నాయకులు ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ **పత్తి సాగులో మెలకువలు పాటించాలి**

కల్హేర్(నారాయణఖేడ్): పత్తి సాగులో మెలకువలు పాటించాలని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం సిర్గాపూర్ మండలం కిషన్‌నాయక్ తండాలో పత్తి, సోయా పంట సాగును పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ శ్వేత, రైతులు ఉన్నారు.

◆ **పచ్చిరొట్టతో దిగుబడులు**

కల్హేర్(నారాయణఖేడ్): పచ్చిరొట్టతో దిగుబడులు సాధించవచ్చని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. కల్హేర్, నిజాంపేట మండలాల్లోని మాసాన్‌పల్లి, బాచేపల్లి, మునిగేపల్లిలో జీలుగ, వరినారు మడులను పరిశీలించారు. ఏఈఓలు భాస్కర్, కష్టావేణి, సంతోష పాల్గొన్నారు.

◆ **ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలి**

ఝరాసంగం(జహీరాబాద్): హరితహారం కార్యక్రమంలో భాగంగా ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని చీలపల్లి, చీలపల్లి తండా గ్రామ శివారులో రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య, ఉపాధిహామీ ఏపీఓ రాజ్‌కుమార్, సీహెచ్ఓ సుదర్శన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **నాణ్యమైన విద్య అందించండి**

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు బ్లాక్ ఆఫీస్ ఆవరణంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాలకు నూతనంగా వచ్చిన ప్రైమరీ స్కూల్‌ల హెచ్‌ఎంలు, ఎస్జీటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పీపీ రాథోడ్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు ఎస్జీటీలు తదితరులు పాల్గొన్నారు.

◆ **బోరుమోటారు ప్రారంభం**

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో బోరుమోటార్‌ను జెడ్పీటీసీ మీనాక్షి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి**

సంగారెడ్డి టౌన్: నీట్ పరీక్షలో సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించి మళ్లీ పరీక్ష నిర్వహించే విధంగా చూడాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్టీఏ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.